క్లుప్తంగా

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న ప్రశాంత్‌గౌడ్

తరిగొప్పుల : మండల కేంద్రంలో బొడ్రాయి, దుర్గామాత గుడి నిర్మాణానికి భువనగిరి జిల్లా ఆలేరు ఎంపీటీసీ ప్రశాంత్ గౌడ్ రూ.1,00,116 నగదును విరాళాన్ని ఎంపీటీసీ అర్జుల మధుసూదన్‌రెడ్డికి గురువారం అందజేశారు. చిలువేరు సంపత్, పలుచాని రమేష్, ఆవుల రాములు, మూడికె కుమార్, తరాల సమ్మయ్య, దామెర బంటి, భూక్య హరిలాల్ నాయక్, పోశిరెడ్డి, తలకొక్కుల రవి, ఆవుల సంపత్, రవి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా బెల్టు షాపులకు మద్యం సరఫరా

తరిగొప్పుల : గ్రామాల్లోని బెల్టు షాపులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే మండలకేంద్రంలోని ఓ వైన్స్ షాపు నిర్వాహకుడు ఇవేవి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. లైసెన్సు మద్యాన్ని యథేచ్ఛగా బెల్టు షాపులకు విక్రయిస్తూ ఎక్సైజ్ శాఖ అధికారుల ఆదేశాలను విస్మరిస్తున్నాడు.

దుర్గమ్మ గుడిలో చోరీ



జనగామ రూరల్ : జనగామ పట్టణంలోని బతుకమ్మకుంట దుర్గమ్మ ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు పడి గుడిలోని హుండీని పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఎప్పటిలాగే పూజ అనంతరం గుడి తలుపులు వేసి వెళ్లగా, రాత్రి హుండీని పగులగొట్టి సుమారు రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. కాగా పోలీసులు గురువారం ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రతిసారి ఆలయంలో నగదు చోరీ చేస్తున్న ఇప్పటి వరకు దొంగలను పట్టుకోవడంలో పోలీసుల విఫలం అవుతున్నారు. ఒక్క కేసు కూడ ఛేదించిన దాఖాలలు లేవు. వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు పటిష్ట నిఘాతో దొంగలను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దాడి కేసులో రిమాండ్

రఘునాథపల్లి : గొడ్డలితో అన్నపై దాడి చేసిన కేసులో తమ్ముడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేష్ గురువారం తెలిపారు. జాఫర్‌గూడెం గ్రామానికి చెందిన కోడెల రాములు, శ్రీను అన్నదమ్ముల మధ్య కొన్నాళ్లుగా భూ వివాదం కొనసాగుతుంది. ఈ నెల 26న శ్రీను తన గేదెలను రాములు వ్యవసాయ భూమిలో మేపుతున్నాడు. తన భూమిలో ఎందుకు మేపుతున్నావని రాములు ఆగ్రహంగా గొడ్డలితో అన్నపై దాడి చేశాడు. దీంతో శ్రీను తలకు, చేతులకు గాయాలయ్యాయి. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాములుపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అంగడి వేలం వాయిదా

రఘునాథపల్లి : రఘునాథపల్లిలో ప్రతి గురువారం నిర్వహించే గొర్రెలు, మేకల అంగడి (సంత)కి 2025–26 సంవత్సరానికి సంబంధించి శుక్రవారం గ్రామ పంచాయతీలో వేలం నిర్వహించాల్సి ఉంది. కానీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి కవిత తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామని, తదుపరి తేదీని ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ప్రకటిస్తామని గురువారం కార్యదర్శి పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

కమలాపూర్ : రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కాజీపేట ఏసీపీ పుప్పాల తిరుమల్ సిబ్బందికి సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌తో పాటు ఉప్పల్, కన్నూర్ గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన టాయిలెట్స్, విద్యుత్, తదితర వసతులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అదే విధంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కన్నూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని బస్టాండ్ సమీపంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్ గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు వేసవి దహార్తిని తీర్చేందుకు ప్రతీ ఏడాది వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి శుద్ధజలం అందిస్తున్నట్లు తెలిపారు.

గోదావరి జలాలతో రైతుల్లో ఆనందం

- రైతుల విషయంలో రాజకీయం తగదు
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



సాగునీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల : రైతుల విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తూ అసత్య విమర్శలు చేయడం తగదు.. గోదావరి జలాలతో రైతులు ఆనందంగా ఉన్నారని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండల శివారులోని శ్రీరాంసాగర్ కెనాల్ ద్వారా సరఫరా అవుతున్న సాగునీటిని ఎమ్మెల్యే పరిశీలించి పంట పొలాల్లో కలియ తిరిగి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఎస్ఆర్ఎస్పీ రెండో దశ ద్వారా సరఫరా అవుతున్న సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకుంటున్నట్లు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. బయ్యన్న వాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా 67, 69, 70, 71 డీబీఎంలలో విడుదల చేసిన గోదావరి జలాలను ఆయా ప్రాంతాల రైతులు పండించే పంటలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. రెండో దశ ద్వారా ప్రతి రోజు 1,700 క్యూసెక్కుల నీటిని ప్రభుత్వం విడుదల చేస్తుండగా లక్ష 69 వేల ఎకరాల పంటలకు గోదావరి జలాలు అందుతున్నాయని ఆమె చెప్పారు. సాగునీటి విషయంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వంపై అర్థంలేని విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వాస్తవాలకు విరుద్ధంగా విమర్శలు చేస్తూ ప్రజల్లో ఇంకా చులకన కాకుండా హుందాగా వ్యవహరించాలని ఆమె హితవు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొడకండ్ల మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, దేవరుప్పుల మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు అంజయ్య, సోమ నర్సయ్య, నాగరాజు, మనోహర్, వంశీకృష్ణ, రమేష్, భిక్షపతి, శ్రీవర్ధ, సతీష్‌గౌడ్, రాజు, సునీల్‌రెడ్డి, వీర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

- వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్



అరూరి రమేశ్‌ను సన్మానిస్తున్న మహిళలు

జఫర్‌గఢ్ : మండలంలోని వడ్డెగూడేనికి చెందిన పలువురు మహిళలు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ సమక్షంలో ఆపార్టీలో గురువారం చేరారు. ఈ సందర్భంగా వారికి బీజేపీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నాయకులు బుర్ర తిరుపతిగౌడ్, తాటి సురేష్‌గౌడ్, నాగేష్ గౌడ్, రమేష్, అన్నెపు రమేష్, మేర్గు రామరాజు, చీకటి శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు. కాగా పార్టీలో చేరిన వారిలో బొడ్డు అశ్విని, మారపల్లి విజయ, బొజ్జు రాణి, కుంటాల శాంత, అంబికా, రంగమ్మ, తాటికాయల రేణుక, శోభ, జలగం పద్మతో పాటు తదితరులు ఉన్నారు.

సిరిసిల్ల రాజయ్యను కలిసిన జెడ్పీటీసీ రవి



రాజయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవి

స్టేషన్‌ఘన్‌పూర్ : తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను హనుమకొండలోని ఆయన నివాసంలో స్టేషన్‌ఘన్‌పూర్ జెడ్పీటీసీ, జనగామ జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మహేందర్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

నియామకం

దేవరుప్పుల : కాంగ్రెస్ పార్టీ పద్మశాలి విభాగం జనగామ జిల్లా అధ్యక్షుడిగా కోలుకొండ గ్రామానికి చెందిన సామల పరమేశ్వర్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గురువారం నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ పద్మశాలి సామాజికవర్గం అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ పక్షాన అంకితభావంతో పనిచేస్తానని, తన నియామకానికి సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజు, పాపా పట్టణ అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు, కాముని శ్రీనివాసు, నల్ల సత్యనారాయణ, ఏల జనార్దన్, పిట్టల సతీష్, గుమ్మడిల్లి సత్యనారాయణ, ఎనగందుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసమే పాదశుద్ధీకరణ



విద్యార్థుల పాదాలు శుభ్రంచేస్తున్న మతగురువు

దేవరుప్పుల : యేసు తన ప్రాణాన్ని త్యజించే ముందు కూడా ప్రపంచ శాంతి సందేశాన్ని విస్తరించేలా అతని వద్ద ఉన్న పన్నెండు మంది శిష్యుల పాదాలను శుద్ధీకరణ చేసిన మహనీయుడని ఫాదర్ దిలీప్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లోని ప్రార్థన మందిరంలో జేసురాజు ఆధ్వర్యంలో పవిత్ర గురువారం పురస్కరించుకొని పాఠశాల విద్యార్థుల పాదాలను మతగురువులు శుద్ధిచేసి యేసు మార్గదర్శకాలను ఆచరించారు. ప్రతి వ్యక్తి జీవితం శాశ్వతం కాదని, తమ పరిసరాల ప్రయోజనాలు కోరుతూ సమాజ శాంతికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్రాన్సిస్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషన్ డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం తెలిపారు. బీఆర్ఎస్ విధానాలు నచ్చక పార్టీకి రాజీనామా చేస్తున్నానని, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు రాజీనామా పత్రాన్ని పంపించినట్లు తెలిపారు. రాజీనామాను ఆమోదించాలని, త్వరలో రాజకీయ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని పేర్కొన్నారు.

చిల్పూరు ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

చిల్పూరు : చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.5,30,180లు వచ్చినట్లు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి సుమతి ఆధ్వర్యంలో చేపట్టగా ఆలయ ఉత్సవ కమిటీ, స్టేషన్‌ఘన్‌పూర్ పద్మశాలి సంఘం సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ యాదవరెడ్డి, ధర్మకర్తలు జక్కుల రాజశేఖర్, ఉప్పరి గణేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడిగా అవకాశం కల్పించాలి



ఆలయంలో వివరాలు తెలుసుకుంటున్న సుమతి

చిల్పూరు : మండలంలోని నష్కల్ గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీరామలింగేశ్వరస్వామి (శివాలయం) వారసత్వ అర్చకంలో తనకు అవకాశం కల్పించాలని ఘణపురం పరమేశ్వరశర్మ అన్నారు. ప్రస్తుతం అర్చకత్వం చేస్తున్న తన అన్న నర్సయ్యశర్మ ఆలయాన్ని తెరవడం లేదని దీంతో ధూప, దీప నైవేద్యం ఆగిపోయిందంటూ ఇటీవల నల్లగొండ జిల్లా దేవాదాయ శాఖలో వినతి పత్రంను సమర్పించారు. ఈవిషయంపై గురువారం నల్లగొండ జిల్లా దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి సుమతి నష్కల్ శివాలయాన్ని సందర్శించారు. ముందుగా ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, మోడెం భిక్షపతి, గంటి ఉపేందర్ యాదవ్ తదితరుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ప్రతీ రోజు ధూప దీప నైవేద్యం చేయాల్సిందేనని చెప్పారు. ఈసందర్భంగా పరమేశ్వరశర్మ మాట్లాడుతూ.. తమ తాత ముత్తాతల కాలం నుంచి వారసత్వంగా అర్చకత్వం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తనకు తన అన్న నర్సయ్యశర్మకు వారసత్వంగా అర్చకత్వం చేసుకునే వీలును గ్రామ పెద్దలు తీర్పునిచ్చారు. గత ప్రభుత్వం ధూపదీప నైవేద్యం పేరుతో రూ. 6 వేలు అందజేశారు. దీంతో అన్న పేరును అందులో చేర్చామన్నాడు. అప్పటి నుంచి చెరి రూ. 3వేలు తీసుకుంటూ పూజలు చేస్తున్నామని తెలిపాడు. తనకు వంతు వచ్చినా అర్చకత్వం చేయనీయడం లేదని అంతేకాకుండా డబ్బులు కూడా ఇవ్వడం లేదని వాపోయాడు. అలాగే 65నక్రమంగా గుడి తెరువడం లేదని దీంతో ధూప దీప నైవేద్యం జరగడం లేదని తనకు అర్చకత్వ అవకాశం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



వర్షశ్రీకి బహుమతి అందజేస్తున్న అధికారులు

తొర్రూరు రూరల్: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి నినాదాల పోటీల్లో మండలంలోని చెర్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వర్షశ్రీ ప్రథమ స్థానం సాధించింది. గురువారం పాఠశాలలో వర్షశ్రీని సన్మానించి, రూ.2వేలనగదుతో పాటు బహుమతులను అందించారు. ఈసందర్భంగా బ్యాంక్ మేనేజర్ మూర్తి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంక్ సేవలు అందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బ్యాంక్ అధికారి రమేష్, హెచ్ఎం మహంకాళి బుచ్చయ్య, ఉపాధ్యాయులు ఎంఎస్ భాను, తనూజ, శ్రీనివాస్, మల్లేశం, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం



బచ్చన్నపేట: నగదు అందజేస్తున్న శివకుమార్‌గౌడ్



నర్మెట: సాయం అందజేస్తున్న సభ్యులు

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన కాశ నడిమింటి బాలరాజు మృతి చెందదాడు. కాగా గురువారం బాధిత కుటుంబ సభ్యులకు సామాజిక సేవకార్యకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. నాయకులు మల్ల సిద్దిరాములు, యాపచెట్టు ఆగయ్య, కొప్పురపు రమేష్‌రెడ్డి, కాశ బాలస్వామి, ప్రవీణ్, నడిమింటి అంజయ్య, బాలయ్య, ఎంటి శ్రీనివాస్, వెంకటయ్య ఉన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు : మండలంలోని వంగాలపల్లి గ్రామానికి చెందిన చింత యువరాజ్ ఇటీవల ప్రమాదవశాత్తు డాబాపై నుంచి పడి తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం మాజీ సర్పంచ్ భూక్య సుధాకర్ నాయక్ ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశాడు. అంతే కాకుండా ఎల్‌ఓసీ ద్వారా పూర్తి వైద్య ఖర్చులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట అరూరి రవిచందర్, దాసు, ప్రభాకర్, చిట్యాల దావీదు ఉన్నారు.

పరామర్శ

నర్మెట : మండలంలోని వెల్దండ గ్రామానికి చెందిన తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం జనగామ జిల్లా కమిటీ అధికార ప్రతినిధి కళ్యాణం రాజు తండ్రి వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా సంఘం జిల్లా అధ్యక్షుడు పంతులు ప్రభాకర్ బాధిత కుటుంబసభ్యులను గురువారం పరామర్శించి రూ.5,000 నగదు అందజేశారు.

లక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రోత్సవం

జనగామ : మండలంలోని కక్కిరాలపల్లిలోని నారసింహుడికి, గర్భాలయంలోని లక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు పూర్తి అయిన తర్వాత ధ్రువ మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు అభిషేకం జరిపించారు. అనంతరం లక్ష్మీ–నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి–వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు మాస కళ్యాణం జరిపించారు.

‘కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి’



ప్రశాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బచ్చన్నపేట : భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న పలు పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆ పార్టీ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. భువనగిరి ఎంపీ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అధిష్టానం ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డికి సమయం చాలడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో కొన్నింటిని అమలు చేశారని, మిగతా వాటిని కూడా అమలు చేస్తారని ప్రజలు అధైర్యపడకూడదని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. మండల ఇన్‌చార్జ్ నూకల బాల్‌రెడ్డి, నాయకులు జంగిటి విద్యానాథ్, పిన్నింటి నారాయణరెడ్డి, కంటెం కర్ణాకర్, మాసపేట రవీందర్‌రెడ్డి, వేముల వెంకట్‌గౌడ్, దిడ్డిగ రమేష్, నిమ్మ కర్ణాకర్‌రెడ్డి, చెరుకూరి శ్రీనివాస్, ఐలయ్య, బందారం క్రాంతి, నేరేళ్ల రాజయ్య, నరేష్ పాల్గొన్నారు.

చామలను కలిసిన కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి

జనగామ : కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

- పట్టించుకోని అధికారులు



స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రంలోని ఎన్పీడీసీఎల్ డీఈ కార్యాలయానికి కూతవేటు దూరంలో రోడ్డుపై విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉన్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ఈరోడ్డు వెంట రోజు అనేక వాహనాలు, ప్రయాణికులు వెళ్తుండగా రోడ్డుకు అడ్డుగా స్తంభం ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ సమీపంలోని పాత ఎస్‌బీఐ కాలనీలో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఎన్పీడీసీఎల్ డీఈ కార్యాలయానికి, ఎంపీడీఓ, తహసీల్దార్ తదితర కార్యాలయాలకు నిత్యం అనేక మంది వెళ్తుంటారు. ఇటీవల ఇక్కడ ఓ భవనం నిర్మించి అందులో ప్రైవేట్ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. అయితే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభాన్ని పక్కకు తొలగించాలని పలుమార్లు కాలనీవాసులు కోరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే అధికారులు ముందస్తుగా స్పందించి స్తంభాన్ని తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు బోనాలు



బోనాలతో వస్తున్న మహిళలు

బచ్చన్నపేట : మండలంలోని బండనాగారం గ్రామంలో శాలివాహన కులస్తులు గురువారం రేణుకా ఎల్లమ్మకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. అనంతరం బోనాలతో వచ్చిన మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. ఆలయ ప్రాంగణంలో బైండ్ల కులస్తులు పలు దేవతల వేషాధారణ వేసి అమ్మవారి కథాపురాణాన్ని వినిపించారు. నేడు (శుక్రవారం) తమ వ్యవసాయ బావుల వద్దకు వన భోజనాలకు వెళ్తామని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇజ్జగిరి రాములు, నాయకులు దశరథ, సత్తయ్య, నరేష్, నర్సింహులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

చైర్మన్, వైస్ చైర్మన్‌ను తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న డైరెక్టర్లు

పాలకుర్తి టౌన్ : పాలకుర్తి రైతు సేవా సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌ను అవిశ్వాసం ద్వారా తొలగించాలని సంఘం డైరెక్టర్లు గురువారం జనగామలోని జిల్లా కార్యాలయంలో డీసీఓకి వినతిపత్రం అందజేశారు. డైరెక్టర్లు మొత్తం 13 మంది ఉండగా 9 మంది అవిశ్వాస తీర్మానం పెట్టాలని దరఖాస్తు పత్రం ఇచ్చారు. డైరెక్టర్లు ఎడవెల్లి పుష్పలీల, ధరావత్ వాసు నాయక్, చింతం వెంకన్న, గంట రామయ్య, బలుగుల స్వరూప, చిలువేరు వీరయ్య, కారుపోతుల శ్రీనివాస్, దండబోయిన నాగమల్లు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్‌ను తొలగించాలని వారు కోరారు.

కదిలిన రెవెన్యూ యంత్రాంగం

- పోశయ్య భూమిని పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



రైతు పోశయ్యతో మాట్లాడుతున్న అధికారులు

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన రైతు పోశయ్య సాగు చేసుకుంటున్న భూమిని నాయబ్ తహసీల్దార్ ఖాసీం, ఏఆర్‌ఐ మునహర్ వెళ్లి పరిశీలించారు. ‘పట్టా చేయడానికి డబ్బులు అడుగుతున్నారు’ అనే కథనాన్ని సాక్షి దినపత్రిక గురువారం ప్రచురించగా రెవెన్యూ అధికారులు స్పందించారు. అధికారులు వెంట తెచ్చుకున్న రికార్డుల ప్రకారం సర్వేనంబర్ ఉందా? లేదా అని పరిశీలించారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ మాట్లాడుతూ.. 60 ఏళ్లుగా పోశయ్య భూమిని సాగు చేసుకుంటున్నా ఇప్పటి వరకు పట్టాదారు పాసు పుస్తకం పొందలేదన్నారు. పరిశీలించిన రికార్డుల నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు అందజేస్తామని తెలిపారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికే తహసీల్దార్ కార్యాలయం, అధికారులు ఉన్నారని తెలిపారు. భూమికి సంబంధించిన పలు వివరాలను రైతు పోశయ్యను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట శీలంకోటి రాజు, బొడ్డు ప్రవీణ్ పలువురు ఉన్నారు.

ప్రజలకు న్యాయ సలహాలు అందిస్తాం

తొర్రూరు: ప్రజలకు న్యాయ సలహాలు అందించేందుకు ఎప్పుడూ ముందుంటామని తొర్రూరు న్యాయవాదుల సంఘం నాయకులు బొమ్మనబోయిన మహేందర్ అన్నారు. తెలంగాణ అడ్వకేట్స్ అసోసియేషన్ డైరీని గురువారం డివిజన్ కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు ఆవిష్కరించారు. మహేందర్ మాట్లాడుతూ.. పలు వివాదాల్లో చిక్కుకొని కోర్టు కేసులు ఉన్న సామాన్యులకు తగు న్యాయ సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం పాటుపడతామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోపాల్, ఘనపురం రామకృష్ణ, అశోక్, మల్లేష్, సైదులు, నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.